
1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 03 సంచిక : 163
శనివారం 20 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.



## అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా.. స్విట్జర్లాండ్ ప్రకటన

- ఇటీవల అమెరికా, ఇరాన్ మధ్య చారిత్రక ఒప్పందం
- కొనసాగింపుగా స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన అమెరికా-ఇరాన్ చర్చలు
- ఒప్పందం అమలు, పర్యవేక్షణపై ఈ చర్చలు
- అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ ప్రకటన
- సాంకేతిక, లాజిస్టిక్ కారణాలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడి
- దాంతో చర్చలు కూడా వాయిదా

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 19

అమెరికా, ఇరాన్ మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన కీలక చర్చలు వాయిదా పడ్డాయి. ఈ చర్చల్లో ఖతార్, పాకిస్థాన్ కూడా పాల్గొనాల్సి ఉంది. ఈ విషయాన్ని స్విట్జర్లాండ్ విదేశాంగ శాఖ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. చర్చల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని, దానికి సంబంధించిన సన్నాహక పనులు కొనసాగుతున్నాయని తెలిపింది. ప్రస్తుతానికి దీనిపై మరింత సమాచారం ఇవ్వలేమని పేర్కొంది. ▶మిగతా 2లో

## రూ.30వేల కోట్లతో తొలిదశ ఔటర్ రింగ్ రోడ్డు



'సుపరిపాలనకు రెండేళ్లు' సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని
సభలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్. వేదికపై కూటమి పార్టీల నాయకులు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 19)

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్‌కు డబ్బు ఆశ తప్ప రాష్ట్రాభివృద్ధి పట్టదని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. గుంటూరులో గురువారం కూటమి సుపరిపాలనకు రెండేళ్ల విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ▶మిగతా 2లో

# మాకు ఇగోలు లేవు

## బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మిస్తాయి..



- ▶కోల్‌కతాలో నారా లోకేశ్
- ▶కోల్‌కతాలో ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సదస్సులో లోకేశ్ కీలక ప్రసంగం
- ▶స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ అనే మూడు సూత్రాలతో ఏపీ ముందుకు వెళ్తోందని వెల్లడి
- ▶రాష్ట్ర అభివృద్ధి ప్రయాణంలో భాగస్వాములు కావాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం
- ▶సంస్కరణల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని వివరణ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 19)

బలమైన రాష్ట్రాలే బలమైన దేశాన్ని నిర్మించగలవని, రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ అనే మూడు ప్రధాన సూత్రాలను ప్రత్యేకతలుగా చేసుకుని ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని, ఈ అభివృద్ధి ప్రయాణంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కోల్‌కతాలోని ఐటీసీ సోనార్ హోటల్‌లో ఇండియన్ ▶మిగతా 2లో

## ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు



దక్షిణ లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు
వైమానిక దాడుల్లో దాదాపు 16 మంది మృతి
ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం
ఒప్పందం ప్రకారం లెబనాన్‌పైనా సైనిక చర్యలు ఆపాలి
అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేసిన నెతన్యాహు
తాజా ఘర్షణలతో శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 19

ఇరాన్-అమెరికా మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన గంటల్లోనే మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు అక్కడి ప్రభుత్వ వార్తా సంస్థ వెల్లడించింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారింది.

దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై గురువారం రాత్రి నుంచి దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణ జరుగుతోందని తెలిపింది. ఈ పరిణామం ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన తాజా ఒప్పందానికి సవాల్‌గా మారింది. ▶మిగతా 2లో

## సమర్థ నాయకుడు ఉంటే ఏదైనా సాధ్యమే: మంత్రి నారా లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 19)

కోల్‌కతా పర్యటనలో భాగంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్లీనరీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఏపీలో పెట్టుబడులకు అవకాశాలు అంశంపై మంత్రి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు కొదవేమీ లేదన్నారు. విరివిగా పరిశ్రమలు వస్తే ఉపాధి అవకాశాలు మరింతగా పెరుగుతాయన్నారు. సమర్థ నాయకుడు ఉంటే ఏదైనా సాధ్యమని ప్రధాని మోదీ నిరూపిస్తున్నారన్నారు. ▶మిగతా 2లో

## రెండేళ్లలో 130 ఎంఎస్‌ఎంఈ పార్కులకు శ్రీకారం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 19)



రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్‌ఎంఈ) పార్కుల ఏర్పాటు లక్ష్యంలో భాగంగా రెండేళ్లలో 130 పార్కులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం పోతవరం వద్ద ఏర్పాటు ▶మిగతా 2లో

## జులై 3 కల్లా గ్రీనింగ్ సొసైటీ



ప్రతి పంచాయతీలో ఒక నర్సరీ ఉండాలి
అటవీ శాఖపై సమీక్షలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 19)

రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతం మేర పచ్చదనం పెంచడమే లక్ష్యంగా ప్రతిపాదించిన 'గ్రీనింగ్ సొసైటీ' ఏర్పాటు ప్రక్రియ జులై 3వ తేదీకల్లా పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ సొసైటీ నిబంధనలు, నియామకాలు, విధివిధానాలు, ప్రతిపాదనలన్నీ కచ్చితంగా 'ప్రెసిడెన్షియల్ ఆర్డర్ 2025'కు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో అటవీశాఖ ఉన్నతాధికారులతో పవన్ సమీక్షించారు. 'ప్రతి పంచాయతీలోనూ ఒక నర్సరీ ఉండేలా చర్యలు తీసుకోవాలి. సాధ్యంకాని చోట కనీసం మూణ్నాలుగు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా చేసి ఉమ్మడిగా నర్సరీని ఏర్పాటు చేయాలి. వీబీ-జీ-రామ్‌జీ పథకంతో నర్సరీల పెంపకాన్ని అనుసంధానించాం. దీని ద్వారా లభించే నిధులు, ఉపాధి దినాలను సమర్థంగా వినియోగించుకుని గ్రామీణ ప్రాంతాల్లో నర్సరీలను అభివృద్ధి చేయాలి' అని పేర్కొన్నారు. '2.6 కోట్ల విత్తన బంతులు (సీడ్ బాల్స్) సిద్ధం చేస్తున్నాం. రానున్న వర్షాకాలంలో అటవీ, ఖాళీ ప్రాంతాల్లో వీటిని వెదజల్లేందుకు అన్ని ఏర్పాట్లూ చేస్తున్నాం. కొండకోనల్లో విత్తనాలు చల్లేందుకు ▶ 2లో

## సీఎం చంద్రబాబును కలిసిన సాయికృష్ణ కుటుంబసభ్యులు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 19)

సాయికృష్ణ తల్లి విజయలక్ష్మితో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

విజయవాడలోని కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి, కుటుంబసభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. తన కుమారుడి అదృశ్యంపై విచారణ జరిపి న్యాయం చేయాలని విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమెకు సీఎం ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై నిష్పక్షపాతంగా ఉన్నతస్థాయి దర్యాప్తు చేయిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సీఐని సస్పెండ్ చేసి దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. సమగ్ర విచారణ జరిపి నిందితులకు శిక్ష పడేలా చేస్తామని చెప్పారు. తప్పుచేసింది ఎంతటివారైనా ఉపేక్షించబోమన్నారు. కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. న్యాయం చేస్తామని సీఎం హామీ ఇవ్వడంపై విజయలక్ష్మి సంతృప్తి వ్యక్తం చేశారు. న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది: సాయికృష్ణ మేనమామతమకు జరిగిన అన్యాయాన్ని సీఎం చంద్రబాబుకు చెప్పామని సాయికృష్ణ మేనమామ ముళ్లపూడి నవరంగ్ తెలిపారు. కుటుంబసభ్యులతో సీఎంను కలిసిన అనంతరం ▶మిగతా 2లో

## ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా భారత్



ఫ్రాన్స్‌లో భారత సంతతి పౌరులతో ప్రధాని మోదీ

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 19

ప్రపంచానికి భారత్ విశ్వసనీయ భాగస్వామిగా ఎదుగుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు వృద్ధి, ఆవిష్కరణలు, అవకాశాలు కల్పించే రంగాల్లో భారత్ పెట్టుబడులు పెడుతోందన్నారు. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ఆయన గురువారం పారిస్‌లో భారత సంతతి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. "ప్రతి దేశం విశ్వసనీయ సరఫరా వ్యవస్థను, సుస్థిర భాగస్వామ్యాన్ని కోరుకుంటోంది. ఇందుకోసం ప్రతి దేశం అటువంటి దీర్ఘకాల భాగస్వామి కోసం అన్వేషిస్తోంది. ▶మిగతా 2లో

## డీఎస్సీ అవకతవకలు, అమరావతి నిర్మాణ వ్యయంపై సీబీఐ దర్యాప్తు జరగాలి



ఒక్కో పోస్టును రూ. 10 నుంచి 15 లక్షలకు అమ్ముకున్నారన్న సుబ్బారెడ్డి
వేలాది మంది మెరిట్ విద్యార్థులు నష్టపోయారని ఆవేదన
అమరావతిలో చదరపు అడుగుకు రూ. 20,500 ఖర్చు చేస్తున్నారని విమర్శ

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 19)

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల నిర్వహించిన డీఎస్సీ నియామకాల్లో భారీగా అక్రమాలు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు అవినీతిమయంగా ▶మిగతా 2లో

# మాకు ఇగోలు లేవు

ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) నిర్వహించిన ప్లీనరీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 'ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలు' అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో లోకేశ్ తన ప్రసంగంతో పెట్టుబడిదారులను ఆకట్టుకున్నారు.

బెంగాల్ స్ఫూర్తి.. రాష్ట్రాల మధ్య పోటీ అవసరం

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "ఈ రోజు బెంగాల్ ఏది ఆలోచిస్తుందో, రేపు భారత్ అదే ఆలోచిస్తుందని చిన్నప్పటి నుంచి వింటూ పెరిగాను. భారతదేశ మేధో, సాంస్కృతిక, ఆర్థిక ప్రయాణానికి కోల్‌కతాయే రాజధానిగా నేను భావిస్తాను. బలమైన బెంగాల్ అంటే బలమైన భారతదేశం అని నేను గట్టిగా నమ్ముతున్నాను" అని అన్నారు.

అంతకుముందు రోజు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రితో సమావేశమైన విషయాన్ని గుర్తుచేసుకుంటూ, అభివృద్ధి పట్ల ఆమె అంకితభావం తనకు స్ఫూర్తినిచ్చిందన్నారు. రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉంటేనే దేశం పురోగమిస్తుందని, అదే సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుని తమ బలాలను పెంచుకోవాలని అభిప్రాయపడ్డారు. భూమి అనేది భారతీయులకు భావోద్వేగంతో కూడిన అంశమైనప్పటికీ, అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులను ఎలా ఒప్పించగలిగామో పశ్చిమబెంగాల్ సీఎంకు వివరించినట్లు తెలిపారు.

ఏపీ పెట్టుబడుల గమ్యస్థానం.. మూడు 'ఎస్' ల మంత్రం

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం స్థిరత్వంతో ముందుకు సాగుతోందని, ఆయన అమలు చేస్తున్న సంస్కరణలను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉందని లోకేశ్ స్పష్టం చేశారు. దేశానికి వస్తున్న మొత్తం పెట్టుబడులలో 25 శాతం ఏపీకే వస్తున్నాయని గుర్తుచేశారు.

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ విజయానికి మూడు 'ఎస్'లే కారణమని వివరించారు. మొదటిది 'స్పీడ్' (వేగం) అని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దశను దాటి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అమలు చేస్తున్నామని తెలిపారు. 13 నెలల్లోనే గూగుల్ వంటి అతిపెద్ద విదేశీ పెట్టుబడిని సాధించడం, ఒకే జూమ్ కాల్‌తో ఆర్సెలార్ మిట్టల్ ప్రాజెక్టును ఖరారు చేయడం, పుట్టపర్తిలో 37 రోజుల్లో 600 ఎకరాలు సేకరించి శంకుస్థాపన చేయడం తమ వేగానికి నిదర్శనమన్నారు.రెండోది 'స్టెబిలిటీ' (స్థిరత్వం) అని, విధానాల్లో స్థిరత్వాన్ని కొనసాగిస్తూ పారిశ్రామికవేత్తలకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. మూడోది 'సర్వీస్' (సేవ) అని, ప్రభుత్వాలను నియంత్రణ సంస్థలుగా కాకుండా సేవలందించే భాగస్వాములుగా తాము భావిస్తామన్నారు. "కస్టమర్ ఈజ్ గాడ్ అనే మార్వాడీల స్ఫూర్తితో మీకు సేవ చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మీరు మా కస్టమర్లు" అని పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి అన్నారు.

మాకు ఎలాంటి ఇగోలు లేవు

2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న ట్రాక్ రికార్డు, ఆయన దార్శనికతతో ఇది సాధ్యమవుతుందన్నారు. జులైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నామని, మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ పార్క్ నిర్మిస్తామని ప్రకటించారు.

ఏపీలో యువశక్తితో కూడిన కొత్త కేబినెట్ ఉందని, తామంతా ఎలాంటి ఇగోలు లేకుండా రాష్ట్ర అభివృద్ధి కోసం కసితో పనిచేస్తున్నామని అన్నారు. "నేను మీకు కేవలం ఒక వాట్సాప్ దూరంలోనే ఉన్నాను. మీ ప్రాజెక్టును మా ప్రాజెక్టుగా భావించి పూర్తిచేస్తాం. మనమంతా కలిసి పనిచేసి, బలమైన రాష్ట్రాల ద్వారా బలమైన భారతదేశాన్ని నిర్మిద్దాం" అని లోకేశ్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఐసీసీ ప్రెసిడెంట్ బ్రిజ్ భూషణ్ అగర్వాల్, ఉపాధ్యక్షుడు కేశవ్ భజంక, ఇతర ప్రముఖ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

ఆ ఒప్పందం ప్రకారం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాల్లో సైనిక చర్యలు వెంటనే నిలిపివేయాలి. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సి ఉంటుంది.అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం వెనక్కి తగ్గేది లేదనే సంకేతాలు ఇచ్చారు. హెజ్బోల్‌లా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు లెబనాన్‌లో సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్-అమెరికా ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు కూడా వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు.

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ. వాన్స్.. స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలే కారణమని వైట్‌హౌస్ తెలిపింది. కానీ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ఇరాన్ తన ప్రతినిధి బృందాన్ని పంపడంలో జాప్యం చేస్తోందన్న వార్తలు వెలువడ్డాయి.

ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న ఆశలు వ్యక్తమయ్యాయి. కానీ లెబనాన్‌లో తాజా దాడులతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఒప్పందం తర్వాత మాట్లాడిన వాన్స్.. ఇజ్రాయెల్‌కు పరోక్ష హెచ్చరిక కూడా చేశారు.

## మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం ప్రపంచంలో ఇజ్రాయెల్ పట్ల అత్యంత సానుకూలంగా వ్యవహరిస్తున్న నాయకుడు ట్రంప్ మాత్రమేనని వ్యాఖ్యానించారు.

ఇప్పటికే యుద్ధంతో అల్లకల్లోలంగా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు ఏ దిశగా వెళ్తాయన్న దానిపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. లెబనాన్‌లో హింస ఆగకపోతే ఇరాన్-అమెరికా శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రెండేళ్లలో 130 ఎంఎస్ఎంఈ పార్కులకు శ్రీకారం

చేసిన ఆటోనగర్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి గురువారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఆటోనగర్‌లో మిగిలిన పనులకు రూ.2.8 కోట్లు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైతే మరో 20 ఎకరాలు కేటాయిస్తామని తెలిపారు. ఆటోనగర్‌లో నెలకొల్పిన మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాలను ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, తితిదే పాలకమండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబును కలిసిన సాయికృష్ణ కుటుంబసభ్యులు

మీడియాతో ఆయన మాట్లాడారు. "సాయికృష్ణ తల్లి బాధను సీఎం చంద్రబాబు అర్థం చేసుకున్నారు. బాధ్యులైన అధికారులను శిక్షిస్తామని ఆయన చెప్పారు. మాలాంటి సామాన్యులకు న్యాయం జరగదని భావించాం. కానీ.. చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో న్యాయం జరుగుతుందనే నమ్మకం వచ్చింది. రాజకీయంగా మాకు ఎవరిపైనా ద్వేషం లేదు. న్యాయం చేయాలని మాత్రమే సీఎంను కోరాం. ఇలాంటి అన్యాయం మరో మనిషికి జరగకూడదు" అని నవరంగ్ అన్నారు.

# ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా భారత్

ఇటువంటి తరుణంలో ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరిస్తోంది" అని మోదీ పేర్కొన్నారు."పారిస్ అద్భుతమైన ఆలోచనలు, ఆవిష్కరణల నగరం. ప్రవాస భారతీయులు ఈ నగరానికి కొత్త కాంతులు తెచ్చారు. భారత్ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. మామూలు చాయ్‌వాలాను భారతదేశం ప్రధానిని చేసింది. 12 ఏళ్లపాటు దేశానికి సేవలందించడం గౌరవంగా భావిస్తున్నా. 12 ఏళ్లలో దేశ జీడీపీ, విమానాశ్రయాలు, జాతీయ రహదారుల నిర్మాణం రెట్టింపయ్యాయి. 25 కోట్ల మంది పేదరికం కోరల నుంచి బయటపడ్డారు. సాధికారికత దిశగా దేశం సాగుతోంది. ప్రజల జీవితాలు మారుతున్నాయి. ప్రపంచ రూపురేఖలను మార్చే స్థాయికి భారత్ ఎదిగింది. భారత్ - ఫ్రాన్స్ తమ సంబంధాలను ప్రత్యేక అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయి. వచ్చే ఏడాది ఇరుదేశాలు కలిసి ప్రపంచంలో నీటి, ఆహార భద్రతకు ఉపయోగపడే 'తృష్ణ' అనే ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నాయి" అని ప్రధాని మోదీ తెలిపారు.

# డీఎస్సీ అవకతవకలు, అమరావతి నిర్మాణ వ్యయంపై సీబీఐ దర్యాప్తు జరగాలి

మారాయని వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏపీలో జరుగుతున్న అవినీతి, శాంతిభద్రతల క్షీణతపై కేంద్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాల్లో అర్హులైన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని, దీనిపై తక్షణమే సిట్టింగ్ జడ్జితో లేదా సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ పరీక్షల నిర్వహణలో పేపర్ లీకేజీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. ఒక్కో పోస్టును రూ. 10 లక్షల నుండి రూ. 15 లక్షల వరకు అమ్ముకున్నారని, స్పోర్ట్స్ కోటా పేరుతో అనర్హులకు ఉద్యోగాలు కట్టబెట్టారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన వారికి, వారి సానుభూతిపరులకే ఔట్‌సోర్సింగ్, ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చుకున్నారని విమర్శించారు. దీనివల్ల వేలాది మంది మెరిట్ విద్యార్థులు నష్టపోయారని, దీనికి సంబంధించిన ఆధారాలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు.రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో పెద్ద ఎత్తున నిధుల లూటీ జరుగుతోందని వైవీ సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. "కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఒక చదరపు అడుగు నిర్మాణానికి రూ. 5,000 లోపే ఖర్చు చేస్తుంటే.. కూటమి ప్రభుత్వం అమరావతిలో చదరపు అడుగుకు ఏకంగా రూ. 20,500 అంచనా వ్యయం చూపిస్తోంది. దేశంలోని ఏ ప్రధాన నగరంలోనూ ఈ స్థాయి నిర్మాణ ఖర్చులు లేవు. అలాగే, జాతీయ రహదారుల సంస్థ కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి రూ. 20 కోట్లు ఖర్చు పెడుతుంటే... ఏపీ ప్రభుత్వం మాత్రం అమరావతిలో కిలోమీటర్‌కు రూ. 58 కోట్లు కేటాయించింది. రూ. 2 లక్షల కోట్ల ప్రజాధనాన్ని తమకు అనుకూలమైన రియల్ ఎస్టేట్ సంస్థల ప్రయోజనాల కోసం దోచిపెడుతున్నారు" అని దుయ్యబట్టారు. ఈ భూముల కేటాయింపులు, వ్యయాలపై కూడా సీబీఐ విచారణ జరగాలన్నారు.

# జులై 3 కల్లా గ్రీనింగ్ సొసైటీ

ఈ సారి 40-50 అత్యాధునిక డ్రోన్లను వినియోగిస్తున్నాం' అని అధికారులు చెప్పగా ఈ కార్యక్రమంలో సమాజంలోని అన్నివర్గాల ప్రజలు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాముల్ని చేయాలని పవన్‌కల్యాణ్ సూచించారు.అరుదైన వెదురు జాతి 'బాంబూసా ఆంధ్రీకమ్' మొక్కల వివరాలతో కూడిన చిత్రపటాన్ని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు చూపించి, వివరిస్తున్న అటవీ దళాల అధిపతి పీవీ చలపతిరావు. చిత్రంలో ఇతర అధికారులు

అరుదైన వృక్ష జాతుల గుర్తింపు

అత్యంత అరుదైన, అంతరించిపోతున్న వెదురు జాతికి చెందిన 10 వృక్షాల్ని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పాములేరు వాగు వెంట అటవీ అధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో లోతైన పరిశోధనలు చేసి, ఆధునిక మాలిక్యూలర్ సైన్స్ ద్వారా ఈ వెదురు జాతిని గుర్తించగలిగారు. దీనికి బాంబూసా ఆంధ్రీకమ్ అని నామకరణం చేశారు. ఇందుకు ఆ అధికారులను పవన్‌కల్యాణ్ అభినందించారు. ఈ వెదురు జాతికి చెందిన 10 వృక్షాలను కాపాడటమే కాకుండా.. వాటి సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. శేషాచలం అడవుల్లో మాత్రమే కనిపించే, ప్రస్తుతం అంతరించిపోయే దశలో ఉన్న 'సైకాస్ శేషాచలన్సిస్' మొక్కల పెంపకానికి, వాటి సంరక్షణకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వివరించారు. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, అటవీ దళాల అధిపతి పీవీ చలపతిరావు, సలహాదారు మల్లికార్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా-ఇరాన్ చర్చలు వాయిదా.. స్విట్జర్లాండ్ ప్రకటన

మరోవైపు, ఇరాన్‌తో సాంకేతిక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేపట్టాల్సిన పర్యటన వాయిదా పడినట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. అయితే, చర్చల కోసం సన్నాహాలు కొనసాగుతున్నాయని, ఇటీవల కుదిరిన అవగాహన ఒప్పందం అమలు లక్ష్యంగా తదుపరి దశ చర్చలు ప్రారంభించడంపై ఇరుపక్షాలు దృష్టి సారించాయని తెలిపింది. "లాజిస్టిక్స్ పరమైన అంశాలు ఎప్పుడూ సులభంగా ఉండవు" అని వైట్‌హౌస్ ప్రతినిధి పేర్కొన్నారు.అంతకుముందు, వైట్‌హౌస్‌లో మాట్లాడిన వాన్స్.. ఈ వారాంతంలోనే చర్చలు ప్రారంభం కావచ్చని అంచనా వేశారు. అయితే, ఇరాన్ నుంచి ప్రతినిధులు బయటకు రావడం అంత సులభం కాదని, సమన్వయం సవాలుగా మారిందని ఆయన అంగీకరించారు. అమెరికా బృందానికి తానే నాయకత్వం వహించనున్నట్టు స్పష్టం చేశారు.

ఇప్పటికే కుదిరిన రాజకీయ ఒప్పందాన్ని ఆచరణలో పెట్టడం, దాని అమలు, పర్యవేక్షణ, నిబంధనలపై స్పష్టత కోసం ఈ చర్చలు జరగాల్సి ఉంది. "మేము మాటలను నమ్మం. చేతలను, ప్రవర్తనను మాత్రమే విశ్వసిస్తాం" అని వాన్స్ పేర్కొంటూ, చర్చల్లో అమెరికా వైఖరి ఎలా ఉండబోతోందో స్పష్టం చేశారు. ప్రస్తుతానికి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించనప్పటికీ, వీలైనంత త్వరగా చర్చలు ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

# రూ.30వేల కోట్లతో తొలిదశ ఔటర్ రింగ్ రోడ్డు

ప్రభుత్వం వచ్చాక రూ.860 కోట్లతో రోడ్ల గుంతలు పూడ్చించామని, రూ.2,500 కోట్లతో రహదారులను బాగు చేశామని, 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూసమస్యలు పరిష్కరించామని వివరించారు. 'సీఎం చంద్రబాబు కోరుకున్న విధంగా అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు 140 మీటర్ల వెడల్పు ఉండేలా, రెండువైపులా సర్వీసురోడ్లు, అమరావతిలో ప్రతి గ్రామానికి అనుసంధానం చేసే లింకురోడ్లు కలిపి నిర్మిస్తే రూ.35 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్లు కావాలి. ఫేజ్-1లో సర్వీసురోడ్లు, లింకురోడ్లు తీసేసి రూ.25 వేల కోట్ల నుంచి రూ.30 వేల కోట్లతో పూర్తి చేస్తాం. ఫేజ్-2లో సర్వీసు రోడ్లు వేస్తాం' అని చంద్రశేఖర్ వివరించారు. రింగ్‌రోడ్డు ఏపీ అభివృద్ధికి బార్ కోడ్‌లా ఉండబోతోందని పేర్కొన్నారు. వైకాపా నాయకులు కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాబోయే మూడేళ్లలో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకువెళ్లేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు భాష్యం రామకృష్ణ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

# సత్తాచాటిన మార్కాపురం జిల్లా ఎడ్లు

(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 19)



మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ నీలంపాటి అమ్మవారి షష్ఠమాదశ (16వ) వార్షికోత్సవ సందర్భంగా రెండు పండ్ల (పాల పండ్ల) సైజు ఎడ్ల పోటీలను ఆలయ కమిటీ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి 15 జత ఎడ్లు పాల్గొన్నాయి. ఇందులో మార్కాపురం జిల్లా పొదిలి మండలం, రాములవీడు గ్రామానికి చెందిన కాసింబుల్స్, తస్లి మా, తన్వీర్‌ల ఎడ్లు 3541 అడుగులు లాగి మొదటి స్థానంలో విజేతగా నిలిచారు. వీరికి స్థానిక గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల నాయకులు రూ.25 వేలను అందజేశారు. కృష్ణాజిల్లా, పెద్దకాకాని మండలం, పెద్దకాకాని గ్రామానికి చెందిన ఏ ఆర్ వై బుల్స్ ఆళ్ళ రాజేష్యాదవ్, లక్ష్మీ యాదవులకు చెందిన ఎడ్లు 3430 అడుగులు లాగి రెండో విజేతగా నిలిచారు. వీరికి సోమ సాయి ట్రాక్టర్ సర్వీస్, సోనాలిక ట్రాక్టర్స్ మార్కాపురం వారు రూ.20 వేలు అందజేశారు. మూడవ బహుమతి కర్నూలు జిల్లా, కోడుమూరు మండలం, వెంకటగిరి గ్రామానికి చెందిన బి ఎల్ కే బుల్స్, శశాంక్ శ్రేయ ఎడ్లు 3416 అడుగు లాగి మూడో విజేతగా నిలిచారు. వీరికి కోలగట్ల వెంకటేశ్వరరెడ్డి రూ.10వేలు, తాతిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి రూ.5,000 వేలు కలిసి మొత్తం రూ.15,000లు అందజేశారు. నాలుగవ స్థానం బివిఎల్‌కే బుల్స్ వారి ఎడ్లు 3,250 అడుగుల దూరాన్ని లాగి నాలుగవ బహుమతిగా రూ.12,000లను ఏరువా వెంకటరెడ్డి అందజేశారు. ప్రకాశం జిల్లా, దర్శి మండలం, రాజంపల్లి గ్రామానికి చెందిన గొర్ల బ్రదర్స్, గొల్ల గోపాల్ కి చెందిన ఎడ్లు 3208 అడుగు లాగి ఐదవబహుమతిని సాధించారు. వీరికి పది వేల రూపాయలను వెన్నా రాజారాంరెడ్డి స్థానిక జడ్పీ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ అందజేశారు. గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, వరగాని గ్రామానికి చెందిన బొడ్డు సంజయ్యిక్టర్ ఎడ్లుజత 3,119 అడుగులు లాగి ఆరవ స్థానంలో నిలిచారు. వీరికి రూ.8,000ల నగదు బహుమతిన భీమనబోయిన చిన్నపుల్లయ్య అందజేశారు. మార్కాపురం జిల్లా, మార్కాపురం మండలం బొడిచర్ల గ్రామానికి చెందిన, బివిఎల్కేబుల్స్,





చల్లగాలి గాలె య్యలకు సంబంధించిన ఎడ్లజత 2900 అడుగులు లాగి ఏడవ స్థానంలో విజేతగా నిలిచారు. వీరికి రూ.5,000 నగదును కెవిఆర్ జెసిబి ఎర్ర్మావర్, ఆర్కే బ్రదర్స్ రామకృష్ణారెడ్డిలు అందజేశారు. కడపజిల్లా, దువ్వూరి మండలం, చింతకుంట్ల గ్రామానికి చెందిన బాల సుబ్బన్న, వెంకట సుబ్బయ్య లకు చెందిన ఎడ్ల జత 2891 అడుగులు లాగి 8వ స్థానంలో విజేతగా నిలిచారు. వీరికి గాలి చిన్న రంగారెడ్డి రూ.3,000ల నగదును బహుమతిగా అందజేశారు. మిగిలిన ఏడు జతులకు ఒక్కొక్క జతకు రూ.2,000 చొప్పున కన్సోలేషన్ బహుమతులుగా ఆలయ కమిటీ వారు దాత సహకారంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో యాంకర్‌గా రవి రెడ్డి, డీఎంకే ఒంగోలు వారు, వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.







ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

20.06.26    శనివారం


# గర్జించిన పొగాకు రైతులు

- గిట్టుబాటు ధరలకై ఒంగోలులో భారీ ట్రాక్టర్ల ర్యాలీ
- కనీస మద్దతు ధర కిలోకు రూ. 300 కేటాయించాలని డిమాండ్
- తక్షణ కొనుగోళ్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- రూ.1000 కోట్లు కేటాయించాలి
- ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పొగాకు చివరి ఆకు వరకు
- కొనుగోలు చేయించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 19)**

వర్జీనియా పొగాకు గిట్టుబాటు ధరలకే వందలాది ట్రాక్టర్లతో ఒంగోలులో పొగాకు రైతులు గర్జించారు. వర్జీనియా పొగాకు కొనుగోలు కంపెనీల నిలువు దోపిడీకి అడ్డుకట్ట వేసి క్వింటా పొగాకును రూ.30 వేల గిట్టుబాటు ధరను ప్రభుత్వం నిర్ణయించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పొగాకు కొనుగోలుకు రూ.1000 కోట్ల నిధులు కేటాయించి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయించాలని జిల్లా నలుమూలల నుండి వచ్చిన పొగాకు రైతులు డిమాండ్ చేశారు. స్థానిక మినీ స్టేడియం నుండి ప్రారంభమైన ట్రాక్టర్ ర్యాలీలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టి పార్టీ వెంకటేశ్వర్లు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వడ్డే హనుమారెడ్డి, కె వీరారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు, ప్రధాన కార్యదర్శి పమిడి వెంకట్రావు, పరిటాల కోటేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు సి ఎస్ సాగర్, నాంచార్లు అగ్రభాగాన్ని నిలిచి ర్యాలీ కి నాయకత్వం వహించారు. (తరువాయి 4లో...)




# అర్జీదారుని సమక్షంలోనే సమస్యను పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 19)**

పీజీఆర్ఎస్‌లో వచ్చే అర్జీదారుల సమస్యలను వారి సమక్షంలోనే పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. సీఎస్ పురం మండలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కనిగిరి నియోజక వర్గంలో భూ సమస్య లపైనే ఎక్కువ అర్జీలు వస్తున్నాయన్నారు. అర్జీలను త్వరిత గతిన పరిష్క రించేందుకు అధికారు లు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కనిగిరి నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన రెండు పీజిఆర్ఎస్ కార్యక్రమాల పై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటి నుండి అధికారులు సమస్యల పరిష్కారం దృష్టి పెట్టాలన్నారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 254 అర్జీలు రాగా, వీటిలో రెవెన్యూకు సంబంధించి 224, ఇతర సమస్యల పై 30 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు, కనిగిరి ఆర్డీవో అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ మోహన్‌రావు, మైనింగ్ జిల్లా అధికారి రవిప్రసాద్, ఐసిడిఎస్ ఇంచార్జ్ పీ డీ పద్మావతి, డిఆర్‌డిఎ పి డి శివన్నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

### పరీక్ష నియమ నిబంధలు ఉల్లంఘనకు పాల్పడే వారి పై చట్ట పరమైన చర్యలు
### ఒంగోలులో 6 కేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు 1,821 మంది విద్యార్థులు హాజరుకానున్నారు
### ఆరు పరీక్షా కేంద్రాల వద్ద ఒక్కో కేంద్రానికి ఒక సీఐ, ఒక ఎస్ఐను నియమించి, 100 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠమైన బందోబస్తు, ప్రత్యేక నిఘా
### ప్రకాశం జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 19)**

జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీన ఆదివారం నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 ప్రవేశ పునఃపరీక్ష సజావుగా జరిగేలా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు తెలియచేసారు. పరీక్షల సమయంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ అధికారులు కట్టుదిట్ట మైన చర్యలు తీసుకుందని తెలిపారు. జూన్ 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నిర్వహించనున్న ఈ పరీక్షకు ప్రకాశం జిల్లాలో మొత్తం 1821 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఒంగోలులో 6 పరీక్షా కేంద్రాల 1821 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నీట్ (యూజీ) 2026 పునఃపరీక్షను ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో (తరువాయి 4లో...)

# మీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యం

## పల్లె నిద్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు




**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 19)**

మీ భూసమస్యకు శాశ్వత పరిష్కారం చూపటమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటాము. ప్రధానమైన గ్రేజింగ్ ల్యాండ్ అంశం పై ప్రత్యేక దృష్టి సారిస్తాము అని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆయన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, సబ్ కలెక్టర్ డి హిమవంశీలతో కలిసి లింగసముద్రం మండలం ఎర్రారెడ్డిపాలెం గ్రామంలో ' పల్లెనిద్ర ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ప్రజలతో ముఖాముఖి చర్చించి వారి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకే ' పల్లెనిద్ర ' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మెరుగైన జీవనోపాధి కోసం ఉపయోగించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ' మనమిత్ర ' వాట్సప్ సేవలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ' కౌశలం ', విపత్తుల సమాచారాన్ని క్షణాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచే ' అవేర్ 2.0 ' ఆన్లైన్ పోర్టల్ గురించి స్వయంగా కలెక్టరే ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని గర్భిణులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. తల్లీబిడ్డ ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ, ఏఎన్ఎంల ద్వారా లభిస్తున్న సేవలను వినియోగించుకోవాలని, పోషకాహారం తీసుకుంటూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా, వైద్యుల ద్వారా పొందుతున్న సేవలపై గర్భిణులు సంతృప్తి వ్యక్తం చేశారు. డ్వాక్రా మహిళలతో కూడా కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని మెరుగైన జీవనోపాధి కోసం వినియోగించుకోవాలని సూచించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంలో కొన్ని దశాబ్దాల నుంచి గ్రేజింగ్ భూముల సమస్య ఉందని, దీని నుంచి శాశ్వత విముక్తి (తరువాయి 4లో...)

# మార్కాపురం జిల్లాలో మొదటి విడతగా 271 మంది జర్నలిస్టులకు అక్రిడిడేషన్‌లు మంజూరు

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 19)**

మార్కాపురం జిల్లా ఏర్పాటైన అనంతరం తొలిసారిగా జిల్లా అక్రిడిడేషన్ కమిటీ సమావేశం గురువారం సాయంత్రం కలెక్టర్ ఎం విజయ సునీత అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ఎర్రగొండపాలెం నియోజక వర్గాలలో పని చేస్తున్న మొత్తం 271 మంది జర్నలిస్టులకు అక్రిడిడేషన్‌లు మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిడేషన్లు అందజేస్తామని, అలాగే వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాలో మొదటి విడతగా 271 మంది జర్నలిస్టులకు ఆక్రిడిడేషన్ మంజూరు చేశామని, ఇంకా మిగిలిపోయిన వారు ఎవరైనా ఉంటే అటువంటి వారందరూ తగిన పత్రాలు అందజేస్తే వారికి రెండవ విడత జరగబోయే సమావేశంలో అక్రిడిడేషన్లు అందజేస్తామని కలెక్టర్ విజయ సునీత అన్నారు. ఎపియుడబ్లూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మూల అల్లూరిరెడ్డి, జాయింట్ సెక్రెటరీ బంకా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ మార్కాపురం జిల్లాలో అంతర్గత భాగమైన శ్రీశైలం దేవస్థానం వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పొడిగించాలని కోరగా, అందుకు స్పందించిన కలెక్టర్ ఈ అంశాన్ని రతప్పకుండా పరిశీలించి, శ్రీశైలం వరకు పాస్ ను పొడిగించే విధంగా చర్యలు తీసుకుంటామని కమిటి సభ్యులకు హామీ ఇచ్చారు. డిపిఆర్ఓ మోహన్ రాజ్ మాట్లాడుతూ సెకండ్ లిస్ట్ కు సంబంధించి త్వరలో సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో అక్రిడిడేషన్ కమిటీ సభ్యులు, ఏపి యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఉమ్మడి ప్రకాశం జిల్లా కోశాధికారి దారివేముల బాబి, సభ్యులు సయ్యద్ బషీర్, వి శ్రీనివాసరెడ్డి, టి నారాయణరెడ్డి, పి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.




# సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

## పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 19)**

ఈ నెల 27వ తేదీన గిద్దలూరు మండలం కృష్ణంశెట్టి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవిని డిజిటల్ నర్వ్ సెంటర్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం సీఎం సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ ప్రదేశం, ప్రజా వేదిక, పార్కింగ్ ప్రాంతాలను, సీఎం కాన్వాయ్ రూట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చుట్టు ఉన్న ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంకా తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.





అనంతరం జిల్లా ఎస్పీ గారు వీఐపీల వాహనాల రాక, సభా స్థలంలో వేదిక, పార్కింగ్ ఏరియా, సీఎం ప్రవేశం, నిష్క్రమణ స్థలాలను, హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ఉన్న రూట్ ను, క్షుణ్ణంగా పరిశీలించి పోలీసు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. ఇతర శాఖల సమన్వయంతో అన్ని చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత మాట్లాడుతూ సంజీవిని పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, డీఎస్పీ నాగరాజు, ఎస్బి ఇన్స్పెక్టర్ యం శ్రీనివాసరావు, గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య, కంభం సీఐ మల్లికార్జున, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. (తరువాయి 4లో...)

# గర్జించిన పొగాకు రైతులు














ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొగాకు రైతులు గిట్టుబాటు ధరల కోసం గత నెల రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన చేసి, వేలం కేంద్రాల వద్ద నిరసన తెలియజేస్తుంటే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం క్వింటాకు రూ.2000 మద్దతు ధర ఇస్తామని పేర్కొనటం దుర్మార్గమన్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రావన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొగాకు కొనుగోలుకు రూ. వెయ్యి కోట్లు కేటాయించి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పొగాకున కొనుగోలు చేయించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి పొగాకు రైతుల సమస్యల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## 22న దర్శి పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)

దర్శి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ నెల 22వ తేదీ (సోమవారం) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించబడుతుందన్నారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో స్పష్టంగా రాసి అందజేయాలని సూచించారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, వినతులను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## చట్లమిట్లలో సికిల్ సెల్ అనేమియా పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 19)

మండలంలోని చట్లమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు సికిల్ సెల్ అనేమియా అవగాహన దినోత్సవం సందర్భంగా మార్కాపురం జిల్లా డిఎల్టిఎఓ డిఎంఓ డాక్టర్ కె రాహుల్, ఐటీడీఏ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్టిఏవో, డిఎంఓ కె రాహుల్ మాట్లాడుతూ సికిల్ సెల్ అనేమియా వంశ పరంపార్యంగా వచ్చే వ్యాధి అని దీనిని పరీక్షల ద్వారా ముందుగా గుర్తించి మందులు వాడినచో ఎలాంటి ఇబ్బంది ఉండదు అని తెలియ జేశారు. వ్యాధి నిర్ధారణ అయినా వారికీ మందులు ఉచితంగా ఇస్తారని తెలియచేసారు. ఏటిడిఏ డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ రవి మాట్లాడుతూ ముక్యంగా ఈ వ్యాధి గిరిజన జాతులలో గుర్తించటం జరిగినది అని ముందుగా గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకొంటే ఈ వ్యాధి బారిన పడకుండా చూసుకో వచ్చు అని తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఎన్ భరత్ కుమార్, సిహెచ్ఓ, ఏఎన్ఎం, హెల్త్ అసిస్టెంట్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 19)



కరేడు గ్రామంలో అంకమ్మ దేవాలయం నుండి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మరియు కరేడు గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు మిరియం శ్రీనివాసులు ప్రభుత్వ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గత రెండు సంవత్సరాల నుండి స్పీడ్ బ్రేకర్లు లేనందువలన ఎన్నో యాక్సిడెంట్లు జరిగాయని గతంలో పంచాయతీ కార్యదర్శికి అర్జీ రూపంలో ఇచ్చినా, నేటికి ప్రమాదాలు జరగకుండా స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయలేదన్నారు. ఇటీవల కాలంలో చిన్న, చిన్న యాక్సిడెంట్లు జరిగాయని, పెద్ద యాక్సిడెంట్లు జరగక ముందే పంచాయతీ వారు స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేయాలని శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## స్వర్ణ గ్రామంలో గ్రామ సభ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 19)

మండలంలోని కరేడు పంచాయతీ స్వర్ణ గ్రామంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే డేటా వాలిడేషన్ పై శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, స్వర్ణ గ్రామ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వివోఏలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మీ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యం

కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెన్షన్, విద్యుత్, వ్యవసాయ, సిమెంట్ రోడ్లు, భూముల మ్యుటేషన్, పశువులకు సంబంధించిన సమస్యలను కూడా ప్రజలు ప్రస్తావించారు. కలెక్టర్ వీటిని ఓపికతో విన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆర్థికేతర సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రేజింగ్ భూముల విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు చెప్పారు. క్షేత్రస్థాయి పరిస్థితిని పరిశీలించి తగిన నివేదికను ప్రభుత్వానికి అందించేలా చూడాలని కలెక్టరును ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఓ వెంకటేశ్వరరావు, జెడ్పీ సీఈవో (ఇంచార్జ్) జాలమ్మ, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందుగా మండలంలోని అన్ని గ్రామాల్లో జిల్లా స్థాయి అధికారులు పర్యటించి స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పల్లె నిద్ర కార్యక్రమంలో కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాగా, ఈ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు తక్షణమే దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.





## నీట్ (యూజీ)-2026 పునఃపరీక్షకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

నిర్వహించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కొక ఎగ్జామ్ సెంటర్ వద్ద ఒక సీఐ, ఒక ఎస్ఐలను నియమించడం జరిగిందన్నారు. ఆరు పరీక్ష కేంద్రల వద్ద ఓవరల్‌గా 100 మంది పోలీసు సిబ్బందితో పటిష్ఠమైన బందోబస్తు ఎర్పాటు చేయడం జరిగిందన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామని, విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో తల్లిదండ్రులు, బంధువులు గుమికూడకుండా సహకరించాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా వ్యవహరించినా, పరీక్ష నిబంధనలను ఉల్లంఘించేందుకు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష విజయవంతంగా నిర్వహించేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు హాల్ టిక్కెట్స్‌లో సూచించిన నియమ, నిబంధనలు విద్యార్థులు కుణ్ణంగా చదువుకొని, వాటిని పాటించాలన్నారు. ఒంగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేంద్రాలలో అవసరమైన వరకు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని, ఎలాంటి అవకతవకలు అవకాశం లేకుండా పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఏ పరీక్షా కేంద్రం వద్ద అయినా ఎటువంటి చిన్న ఘటన జరిగినా వెంటనే డయల్ 100/112 లేదా జిల్లా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

# సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన







## అర్జీదారుని సమక్షంలోనే సమస్యను పరిష్కరించాలి

# సత్వర పరిష్కారంతో ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలి

## జిల్లా కలెక్టర్ పి రాజాబాబు









**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 19)**

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కారించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నియోజకవర్గ స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ విశేష ఫలితాలను ఇస్తోందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం కందుకూరు నియోజకవర్గం, లింగసముద్రం మండల కేంద్రంలోని కెఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన నియోజక వర్గ ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశిలతో కలిసి పాల్గొని ప్రజల నుండి వినతులను స్వీకరించడంతో పాటు వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉన్న సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం జిల్లాలో నియోజకవర్గ స్థాయి పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే శుక్రవారం కందుకూరు నియోజకవర్గ పరిధిలోని లింగసముద్రం మండల కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామ స్థాయిలో ప్రజా సమస్యలు పరిష్కరించునేందుకు దోహద పడుతుందన్నారు. లింగసముద్రం మండలం ఎక్కువ రెవెన్యూ సమస్యలు ఉన్న మండలమని అన్నారు. ఈ కార్యక్రమంలో 135 అర్జీలు వివిధ సమస్యలపై రావడం జరిగిందన్నారు. అందులో చుక్కల భూముల సమస్య, పొజిషన్లో ఒకరు ఉండి, ఆన్ లైన్లో మరొకరు ఉండటం, అసైన్ భూములకు సంబంధించి పట్టాలు లేకపోవడం ఇలా ఎక్కువ శాతం రెవెన్యూ, భూ సమస్యలపై ప్రజల నుండి అర్జీలు రావడం జరిగిందన్నారు. వచ్చిన అర్జీలపై వచ్చే వారం నాటికి సమగ్ర విచారణ, నివేదికలు సిద్ధం చేసి ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరిస్తూ ప్రజలకు సుపరిపాలన అందించే లక్ష్యంతో జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం రోజు 1 నియోజకవర్గం, 4 పర్యటనలు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం కందుకూరు నియోజకవర్గ పరిధిలోని లింగసముద్రం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారుల సమక్షంలో ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. లింగసముద్రం మండలంలో ఎక్కువ రెవెన్యూ సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. ఈ రోజు జరిగిన నియోజకవర్గ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 135 అర్జీలు రావడం జరిగిందన్నారు. ఈ అర్జీలన్నింటినీ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాధురి, డిపిఓ వేంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# బోర్డు ప్రత్యేక చొరవ తీసుకొని కంపెనీల సిండికేటును ఎత్తివేయాలి

**పొగాకు రైతుల ఆందోళనలను పరిగణలోకి తీసుకోవాలి**
**పొగాకు పంట మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి**
**పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి**
**లేదంటే రైతుకు ఆత్మహత్యే శరణ్యం**
**మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన యాదవ్**

**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 19)**



కందుకూరు నియోజకవర్గంలో పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని స్పెషల్ గ్రాంట్ విడుదల చేసి మార్క్ ఫెడ్ ద్వారా పొగాకును కొనుగోలు చేయాలి, లేకపోతే పొగాకు రైతుకు ఆత్మహత్యే శరణ్యమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు మార్కెట్ స్థిరీకరణ కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. మార్కెట్ కు వచ్చిన పంట తిరిగి వెళ్ళకూడదని కిలో 200 రూపాయలకు తగ్గకూడదని సీఎం చంద్రబాబు నాయుడు అంటుంటే కందుకూరు వేలం కేంద్రంలో 150 -160 కి మించి ధర పలకటం లేదు. దీనివలన పొగాకు రైతు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి దాపురించిందని అన్నారు. కంపెనీలుసిండికేట్ గా ఏర్పడి పొగాకును కొనుగోలు చేయకుండా రైతులు ఇబ్బందేపడే విధంగా వ్యవహరిస్తున్నారు తక్షణం బోర్డు ప్రత్యేకంగా చొరవ తీసుకొని కంపెనీల సిండికేటును ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతు పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు రోడ్లెక్కి ఆందోళన చేస్తుంటే దానిని పరిగణలోకి తీసుకొనకుండా పోలీసులను, అధికారులను పెట్టి రైతులను అడ్డుకునే ప్రయత్నం చేయటం సరైనది కాదని, రైతుల ఆందోళన గుర్తించి రైతు పండించిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు రైతు గత మూడు రోజులుగా కందుకూరు లోని వేలం కేంద్రాలను వేలంలో పాల్గొనకుండా బహిష్కరిస్తున్నారంటే ధర ఎంత దారుణంగా పడిపోయిందో అర్థం చేసుకోవాలని ఆరు కాలం కష్టపడిన రైతు శ్రమకు విలువ కల్పించి తక్షణమే పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించి కందుకూరు ప్రాంతంలో పండించిన పొగాకు పంట మొత్తాన్ని నోబ్రిడ్డ్, లోబ్రిడ్ లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. జగనన్న గవర్నమెంట్‌లో పొగాకు రైతుకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా గిట్టుబాటు ధరలు కల్పించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరముల నుండి పొగాకు రైతుకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పాలవుతున్నాడు వెంటనే కూటమి ప్రభుత్వం పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు.

## నగర పంచాయతీ కార్మికులకు గ్లౌజులు అందజేసిన హబీబుల్లా బెగ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 19)**

పొదిలి నగర పంచాయతీ కార్మికులకు శుక్రవారం హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సేవా చైర్మన్ మొగల్ కరిముల్లా బేగ్ చేతి తొడుగులు అందజేశారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ కమిషనర్ యు ఆంజనేయులు మాట్లాడారు. నగర పంచాయతీ కార్మికులకు చేతి తొడుగులు అవసరం ఉందని కరీముల్లా బేగ్ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ఆయన స్పందించి వీటిని సమకూర్చారని చెప్పారు. సమాజ సేవలో హబీబుల్లా స్వచంధ సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను తెలుసుకొని కరీముల్లా బేగ్‌ను అభినందించారు. పింఛన్ల సంఘం నాయకులు హుస్సేన్ పాచా మాట్లాడుతూ కరిముల్లా బెగ్ సమాజ సేవలో ఎప్పుడు ముందుంటారన్నారు. యోగ గురువు ఏ శంకర్రావు మాట్లాడుతూ ప్రతి రోజు పేదల ఆకలి తీరుస్తూ, ప్రతి ఏడాది పేదల అవసరాలు తీరుస్తూ సమాజానికి కరిముల్లా ఎంతగానో సేవలు అందిస్తున్నారని కొనియాడారు. అనంతరం కరిముల్లా బేగ్, కమిషనర్ ఆంజనేయులు, సానిటరీ ఇన్స్పెక్టర్ మారుతిరావు చేతుల మీదుగా కార్మికులకు గ్లౌజులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ మేనేజర్ షేక్షావలి, ఏఈ శంకర్ నాయక్, సచివాలయం ఉద్యోగులు, నగర పంచాయతీ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్‌బుక్స్, ఇతర సామాగ్రి బహూకరణ





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 19)**

మండలంలోని కరేడు పంచాయతీ రామకృష్ణాపురం ఎంపిపి పాఠశాల నందు శుక్రవారం కరేడు గ్రామ నివాసి అయిన స్వర్గీయ వేముల శ్రీనివాసరావు జ్ఞాపకార్థం వారి కుమారుడు వేముల రామకృష్ణ సుమారు రూ.15వేలు విలువ కలిగిన నోట్ బుక్స్, ఇతర సామగ్రి విద్యార్థులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ 1 పీవీ రత్నం, ఎంఈఓ 2 పీవీ రమణయ్య, కాంప్లెక్స్ చైర్మెన్ పి శ్రీనివాసులు, సీఆర్పీ కృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ తిరుపతి, ఎస్ఎంసి చైర్మెన్ కుమారి, తల్లిదండ్రులు, పాఠశాల, హెచ్ఎం కోటయ్య, టీచర్ భాస్కర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

## యోగాతో మనసుకు ఆనందం శరీరానికి ఆరోగ్యం





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 19)**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం పొదిలి నగర పంచాయతీ కమిషనర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలో యోగాంధ్ర 2026 కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ జీవన శైలిలో యోగాను ఒక భాగంగా అలవర్చుకోవాలన్నారు. దానివల్ల మానసిక ఆనందం, శరీరానికి ఆరోగ్యం లభిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ షేక్షావలి, శానిటరీ ఇన్స్పెక్టర్ మారుతిరావు, మున్సిపల్ ఏఈ శంకర్ నాయక్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజావేదిక







**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)**

నగరంలోని ఎమ్మెల్యే బికే క్యాంపు కార్యాలయం నందు శుక్రవారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొని ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజలు వెల్లడించిన ప్రతీ సమస్యను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో వెంటనే చర్చించి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## 104 వైద్యశిబిరన్ని సందర్శించిన అర్‌ఏమ్ మొహమ్మద్ ఖలీం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 19)**

వైద్య సేవలకు దూరంగా వున్న గ్రామల్లోని వయోవృద్ధులు,అనారోగ్యంతో భాధపడేవారు, షుగర్, మధుమేహం, బిపి, జ్వరం వంటి వాటితో భాధపడేవారికి అసుపత్రికి వేళ్ళే పని లేకుండా 104 సేవలు గ్రామంలోని అందుబాటులో వుంటున్నాయని 104 అర్‌ఏమ్ మొహమ్మద్ ఖలీం అన్నారు. మండలంలోని సంతరావురు ప్రభుత్వ వైద్య శాల పరిధిలోని కడవకుదురు-2 ఎస్టీ కాలనీ కాలనీ అంగన్వాడీ కేంద్రం నందు ప్రభుత్వ వైద్యరాలు అర్.కే. కీర్తి సరోజ్ అధ్వర్యంలో నిర్వహించిన 104 వైద్య శిబిరాన్ని 104 అర్‌ఏమ్ మొహమ్మద్ ఖలీం సందర్శించారు. ఈ సందర్భంగా ఓపి, ఇహేచ్‌అర్ రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే కీర్తి సరోజ్, 104 డిఈఓ పొదిలి రాఘవ, సిహెచ్‌ఓ వి రమ్య, ఎఎన్‌ఎమ్ ఎమ్ శారదా, ఆశాలు పాల్గొన్నారు.

## కలెక్టరను కలిసి ఎమ్మెల్యే దామచర్ల



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)**

జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజాబాబుని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావుని కలసి రెవెన్యు అధికారులతో సమావేశమయ్యారు. ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. ఒంగోలు నగర కార్పోరేషన్ పరిధిలో పేదల గృహ నిర్మాణాలకు నిర్దేశించిన లే అవుట్స్ లో అర్హులైన లబ్దిదారులకు వీలైనంత తొందరగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ని కోరారు.

# మాచర్లలో దద్దరిల్లిన విజయోత్సవ సభ



- దిగ్విజయ ర్యాలీలో కదంతొక్కిన జన సంద్రోహం
- కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనకు నిరాజనాలు
- బెబ్బులి పులి బ్రహ్మారెడ్డికి బ్రహ్మారథం
- చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు
- తండ్రికి తగ్గ తనయుడు జెబీఆర్
- ఎమ్మెల్యే చదలవాడ
- పిన్నెల్లి పిచ్చి పరాకాష్టకు చేరింది
- ఎమ్మెల్యే భాష్యం
- పసుపు హిట్‌తో కాక్రోచ్‌లను తరిమికొడతాం
- ఎమ్మెల్యే జూలకంటి

**(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, జూన్ 19)**

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన దిగ్విజయంగా ముగిసిన సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్, మెయిన్ రోడ్డులో రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం పేరుతో శుక్రవారం నిర్వహించిన విజయోత్సవ సభా జనసంద్రోహంతో దద్దరిల్లింది. ముందుగా వెల్దుర్తి నుంచి వేలాది ద్విచక్ర వాహనాలు, వందలాది టాక్టర్లు, కార్లలో వచ్చి స్థానిక శ్రీశైలం రోడ్డులోని పెద్దాంజనేయస్వామి వారి దేవస్థానంలో అభయాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నుంచి ఇసుకెస్తేరాలనంత జనసంద్రోహం నడుమ భారీ ర్యాలీ తీశారు. కిలో మీటర్ వరకు సాగిన నాలుగు గంటల సమయం పట్టగా పసుపు, ఎరుపు, కాషాయం జెండాలు ర్యాలీలో రెపరెపలాడాయి. డీజే మోతలు, కోలాటాలు, డప్పువాయిద్యాల నృత్యాలతో పట్టణ పురవీధులు మారుమోగాయి. కోలాహలంగా సాగుతున్న ర్యాలీలో గజమాలతో కూటమి పార్టీల శ్రేణులు అతిరథ మహారధులకు స్వాగతం పలికారు. రింగ్ రోడ్డు సెంటర్, నాగార్జున కళామందిరం మీదిగా ర్యాలీ శ్రీనివాస మహల్ సెంటర్ వద్దనున్న బహిరంగ సభ వేదిక వద్దకు సాగింది. టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావుగారి విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ జోడితో అన్ని ప్రభుత్వ రంగాలు ఉన్నతంగా ముందుకు పోతున్నాయని నేతలు కొనియాడారు.

**బెబ్బులి పులి బ్రహ్మారెడ్డికిబ్రహ్మారథం**
**చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**

మాచర్ల నియోజకవర్గంలో గత వైసిపి అరాచక శక్తులపై తిరగబడి ప్రజలను రక్షించిన బెబ్బులిపులి బ్రహ్మారెడ్డికి నేడు బ్రహ్మారథం పట్టారని వినుకొండ ఎమ్మెల్యే ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులు కొనియాడారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అభివృద్ధి సంక్షేమం విజయపథంలో ముందుకుపోతుందని వివరించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు,రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు చూసి విజయోత్సవ ర్యాలీలకు ప్రజల తరలివస్తున్నారని తెలిపారు. పిన్నెల్లి దౌర్జన్య పై గలమెత్తి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి, ప్రజా విజయంతో నియోజకవర్గాన్ని అన్ని



విధాలుగా అభివృద్ధి చేస్తున్నారని చెప్పుకొచ్చారు. అభివృద్ధికి చిరునామాగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని,ఇచ్చిన ప్రతి హామీలకు మించి సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తుందని గుర్తు చేశారు.

**తండ్రికి తగ్గ తనయుడు జూలకంటి**
**ఎమ్మెల్యే చదలవాడ**

మాజీ శాసన సభ్యులు దివంగత జూలకంటి నాగిరెడ్డికి తగ్గ తనయుడు ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి అని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు అన్నారు. పిన్నెల్లి సైకో సైన్యంపై యుద్ధం చేసి మరి,తెలుగుదేశం పార్టీని గెలిపించిన ప్రజలకు జూలకంటి ప్రశాంత జీవనాన్ని అందుస్తున్నారని చెప్పారు. కుప్పం తో సమానంగా మాచర్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నాడు. 175 నియోజకవర్గాలు ఎవరికైనా సీటు ఉంటుందో లేదో తెలియదు కానీ, మాచర్ల నియోజకవర్గానికి బ్రహ్మారెడ్డి ఎప్పుడూ ఎమ్మెల్యే గానే ఉంటారని జ్యోష్యం చెప్పారు.

**పిన్నెల్లి పిచ్చి పరాకాష్టకు చేరింది**
**ఎమ్మెల్యే భాష్యం**

మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి పిచ్చి పరాకాష్టకు చేరిందని పెద్దకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం కోల్పోయిన పిన్నెల్లి సోదరులకు మదం తగ్గలేదని మండిపడ్డారు. ప్రజలను చిత్రహింసలు పెట్టి, రాజకీయ పబ్బం గడిపే నీచులకు ఏం తెలుసు ప్రజాస్వామ్యం విలువ అని విమర్శించారు. ప్రజల మనిషిగా బ్రహ్మారెడ్డి అభివృద్ధి వైపు పయనిస్తున్న తీరు ప్రశంసనీయమన్నారు.

**పసుపు హిట్టుతో కాక్రోచులను తరిమికొడతాం**
**ఎమ్మెల్యే జూలకంటి**

పులి అని చెప్పుకునే జగన్‌రెడ్డి నేడు కాక్రోచ్ మాదిరిగా తయారయ్యాడని, పసుపు హిట్ కొట్టి మరి, రాష్ట్రం నుంచి తరిమి కొడతామని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రూ. 1732 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టి, రూ. 650 కోట్ల సంక్షేమాన్ని ప్రజలకు అందించామని చెప్పడానికి ఎంతో గర్వంగా ఉందన్నారు. సంక్షేమాన్ని,అభివృద్ధిని కలిపి అభివృద్ధిగా లెక్కలో చూపటం పిన్నెల్లి మోసపూరిత విధానాలకు నిదర్శనం అన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి ఉండాలని ఇప్పటికే ఫారెస్ట్ క్లియరెన్స్, భూ సేకరణకు రూ. 78 కోట్ల నిధులను విడుదల చేశారని గుర్తు చేశారు. వరికపూడిశెల నిర్మించుకుంటే పూర్తిగా రాజకీయాలకు దూరంగా ఉంటానని అనాడే చెప్పానని, ప్రాజెక్టును కచ్చితంగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాజకీయ సన్యాసం తీసుకుంటానన్న పిన్నెల్లి సన్నాసి సిగ్గులేకుండా ఇంకా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ జీవితం కన్నా, ప్రజాసేవే తనకు ముఖ్యమని చెప్పారు. ప్రజా శ్రేయస్సుకు కట్టుబడి తన రాజకీయ జీవితం ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

# 22న ‘ బ్రిలియంట్ ఎడ్యుకేషన్ ’ మెగా ఫేర్

### ఇంజినీరింగ్, మెడికల్ మాక్ వెబ్ ఆప్షన్స్ సెషన్
### ముఖ్య అతిథులుగా హాజరు కానున్న పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు
### అవకాశాన్ని సద్వినియోగం చేసువాలని బ్రిలియంట్ అధినేత న్యామతుల్లా బాషా పిలుపు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 19)**

ఈ నెల 22వ తేదీన సోమవారం బ్రిలియంట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగాఫేర్ ఒంగోలు లోని ఎ -1 కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత డాక్టర్ షేక్ న్యామతుల్లా భాష పేర్కొన్నారు. స్థానిక అంజయ్య రోడ్డులోని బ్రిలియంట్ కంప్యూటర్ సెంటర్లో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యామతుల్లా భాష మాట్లాడుతూ 2026 విద్యా సంవత్సరంకు సంబంధించి ఇంజనీరింగ్, మెడికల్ మాక్ వెబ్ ఆప్షన్ సెషన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు ప్రారంభిస్తారని, అలాగే ఇంజనీరింగ్, మెడికల్ మాక్ వెబ్ ఆప్షన్ సెషన్‌ను జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి ప్రారంభిస్తారని తెలిపారు. అలాగే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ డిజిపి (ఎపి) కేఆర్‌ఎం కిషోర్ కుమార్, యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్స్ పాల్గొంటారని తెలిపారు.

ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థుల కోసం మాక్ వెబ్ అప్షన్స్ సెషన్స్ ను బ్రిలియంట్ కంప్యూటర్స్ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 22 ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఒంగోలు ఎ1 కన్వెన్షన్ హాలులో బ్రిలియంట్ ఎడ్యుకేషన్ మెగా ఫెర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఎడ్యుకేషన్ ఫెయిర్‌లో క్విస్, శ్రీ హర్షిణి, వివిఐటి, విఐటి, కేఎల్, జిఎంఆర్‌ఐటి, ఐసిఎఫ్‌ఏఐ, జిజియుఎంబి యు విజ్ఞాన్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు, ఇంకా మరిన్నో యూనివర్సిటీలు, కాలేజ్‌లు పాల్గొంటాయని తెలిపారు. విద్యార్థులకు ఉచిత ప్రవేశం, ఉచిత భోజనం, ఎడ్యుకేషన్స్ లోన్స్‌కు సంబంధించిన సమాచారం అందించడంతో పాటు లక్కీ డ్రా ద్వారా లాప్ ట్యాప్ లు గెలుచుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్మీడియట్లో 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ముఖ్య అతిథుల చేతుల మీదుగా గోల్డ్ మెడల్స్, ఎక్సలెన్సీ అవార్డు, సర్టిఫికెట్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు తమ పేర్లను వెంటనే బ్రిలియంట్ కంప్యూటర్స్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రిలియంట్ కంప్యూటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తుహురా, డైరెక్టర్ అఖిల్, కోర్సు కోఆర్డినేటర్, ఎడ్యుకేషన్ టీం సభ్యులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 8019479999ను సంప్రదించాలని కోరారు.

## సర్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించండి
### జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత





**(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 19)**

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశించారు. గిద్దలూరు వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో శుక్రవారం సర్ కార్యక్రమం పై బూత్ లెవెల్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని తెలిపారు. రాజకీయ పార్టీల కనుసన్నల్లో పనిచేసిన వారిని సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా ప్రలోభ పెట్టే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అర్హులైన వారి ఓట్లను తీసివేయకుండా జాగ్రత్త పడాలన్నారు. మీకు ఇచ్చిన ఫారాలను వేరే వారికి అప్పగించడం ఒంటి కార్యక్రమాలు చేయకూడదన్నారు. మంగళవారం నాటికి ఎన్యూమ్యూరేషన్ ఫారాలు పూర్తిస్థాయిలో ప్రజలకు అందజేయాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి, కంభం ఎస్‌డిసి సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నూతన శక్తికి నిత్య యోగా సాధన ఉత్తమ మార్గం



## జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి







**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 19)** నూతన శక్తికి నిత్య యోగా సాధన ఉత్తమ మార్గమని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో జరుగుతున్న యోగా సాధనలో భాగంగా శుక్రవారం ఒంగోలు నగరంలోని గాంధీ పార్కులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, పిడిసిసి బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్యలతో కలిసి ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన ఈ యోగా సాధనలో మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం 'యోగాంధ్ర' కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు స్పష్టం చేశారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు. నిత్యం యోగా సాధన చేయటం ద్వారా నూతన శక్తిని, ఉత్సాహాన్ని పొందవచ్చు అన్నారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. సీతారామయ్య మాట్లాడుతూ జీవనశైలిని మార్చుకోవటం ద్వారా దీర్ఘాయువును, ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. దీనికి యోగా సాధన అత్యుత్తమమని చెప్పారు. పతంజలి యోగా సంస్థ నిపుణుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి తేళ్ల రవికుమార్, యోగాంధ్ర నోడల్ ఆఫీసర్ డాక్టర్ భీమ్ నాథ్, జిల్లా స్థాయి అధికారులు, ఆర్డిఓ చంద్రశేఖర్ నాయుడు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఏఎంసీ చైర్మన్ ఆర్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

### రెడ్ క్రాస్ ప్రాంగణంలో నిత్య సాధన

పతంజలి సంస్థ యోగా గురువు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఈనెల 22 తేదీ నుంచి ఒంగోలు నగరంలోని రెడ్ క్రాస్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతి రోజూ యోగా శిక్షణా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రజల ఆసక్తి మేరకు ఈ కార్యక్రమాలను ఇతర ప్రాంతాలకు కూడా విస్తరిస్తామన్నారు.





# నాయుడు పల్లి బీసీ కాలనీలోని రస్తాపై రియల్ టర్ల కన్ను

## కాలనీవాసుల ఆందోళన......

## తహసిల్దార్, ఎంపీడీవోలకు అర్జీలు







**(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జూన్ 19)**

మండల కేంద్రమైన తర్లుపాడులోని నాయుడుపల్లి బీసీ కాలనీలో సుమారు 40 సంవత్సరాల క్రితం టిడిపి కంభం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ చప్పిడి వెంగయ్య హయాంలో రైల్వే గేట్ సమీపాన బీసీ, ఎస్సీ ప్రజలకు కాలనీ ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించడం జరిగింది. గతంలోనే గ్రామంలోని రజకులకు దోబీ కానాలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. దాని ప్రక్కనే త్రాగునీటి ట్యాంకు రాములవారి దేవాలయానికి సామూహికంగా ప్రభుత్వమే స్థలాన్ని కేటాయించడం జరిగింది. ఆ స్థలం వరకు కాలనీ వాసులకు రస్తాను ఏర్పరచడం కూడా జరిగింది. ఈ క్రమంలో మార్కాపురం జిల్లా కావడంతో స్థలాలకు మంచి డిమాండ్ పలకడంతో ఈ స్థలాలను ఆనుకొని ప్రైవేటు వ్యక్తుల భూములు కూడా కలవు. ఈ నేపథ్యంలో రియల్టర్ల హల్చల్ అధికం కావడంతో అక్కడ ఉన్న కాలనీకి సంబంధం లేని వ్యక్తి యొక్క భూమిని కొందరు స్థానిక ఏజెంట్ల సహకారంతో ఒక రియల్టర్‌కు కొనుగోలు చేపించి ఆ స్థలానికి లేని రాస్తాను కాలనీ గుండా రస్తాను ఏర్పాటు చేసుకునేందుకు సమీపాన ఉన్న ఒక వ్యక్తితో సంప్రదించి రస్తాను కూడా రియాల్టర్ లక్షల్లో కొనుగోలు చేసి కొంత అడ్వాన్స్ డబ్బులను ఆ వ్యక్తికి ఇచ్చినట్లు కాలనీ ప్రజలు విశ్వసనీయంగా గమనించడం జరిగింది. దీంతో కాలనీ వాసులు అందరూ స్త్రీ, పురుషులందరూ స్థానిక తహసిల్దార్ కె శిరీష, ఎంపీడీవో జయరాం నాయక్‌లకు అందరూ కలిసి ప్రభుత్వం కేటాయించిన రాస్తా స్థలం పై సమగ్రమైన విచారణ జరిపి మాకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు వారి మొరను విన్నవించుకుని వారి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తాహసిల్దార్ కె శిరీష కు, ఎంపీడీవో జయరాంనాయక్‌లకు అందజేశారు. దీంతో సంబంధిత అధికారులు వారు తెలిపిన సమస్యల పై వెంటనే స్పందించి కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా మీ సమస్యను తీరుస్తామని హామీ ఇవ్వడం జరిగింది. దీంతో కాలనీవాసులు అందరూ వారి పై నమ్మకంతో వెనుదిగారు. ఈ కార్యక్రమంలో కాలని వాసులు అందరూ పాల్గొన్నారు.

# దొరువు ఆధునీకరణ త్వరలో పూర్తి చేస్తాం



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 19)**

కనిగిరి పట్టణంలోని మంచినీటి దొరువు ఆధునికీకరణ పనులను త్వరలో పుర్తిచేయనున్నట్లు మునిసిపల్ కమీషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. శుక్రవారం పురపాలకసంఘం పరిధిలోని దొరువు వద్ద కుళాయిలు, రోడ్డు ఆధునీకరణ పనులను కమీషనర్ పర్వతనేని శ్రీధర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమీషనర్ పి శ్రీధర్ మాట్లాడుతూ కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు దొరువు అభివృద్ధి పనులు జరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దొరువు ఆధునీకీకరణ పనులు జరుగుతున్న తీరును పరిశీలించి కాంట్రాక్టర్ కు పలు సూచనలిచ్చారు. దొరువు వద్ద జరుగుతున్న పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్ కు ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద గల త్రాగునీటి కుళాయిలు తుప్పు పట్టి లీకుల వలన నీరు పట్టుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడకుండా నూతన కుళాయిలను ఏర్పాటు చేశామని తెలిపారు. కమీషనర్ వెంట అసిస్టెంట్ ఇంజనీర్ కోటేశ్వరరావు, మునిసిపల్, సచివాలయ సిబ్బంది, నాయకులు తదితరులున్నారు.






# సర్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన తహసిల్దార్



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 19)**

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని మండల తహసిల్దార్ ఎంవి కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ జరిపారు. మండలంలోని తలమళ్ళ, ఉప్పలపాడు గ్రామాల్లో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ జరిపి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ సిబ్బందికి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో విజయవంతం జరిగేలా సిబ్బంది కృషి చేయాలని ఆయన ఆదేశించారు. సోమవారం లోపు అందరూ ఓటర్లకు ఎన్విరేషన్ ఫారాలు పంపిణీ చేయాలని బిఎల్ఓలను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్ కార్యక్రమంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా, బాధ్యుల పై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవిన్య అధికారులు పాల్గొన్నారు.

# రెండేళ్ల పాలన ప్రజా విశ్వాసానికి నిదర్శనం

## మోడీ, చంద్రబాబు, పవన్ నాయకత్వం పై ప్రజల నమ్మకం చెక్కుచెదరలేదు

## బాపట్ల లో రెండేళ్ల విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ఏలూరి



**(షణ్ముఖ వెలుగు, బాపట్లస, జూన్ 19)**

ప్రజలు కూటమి ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రంలో నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం" బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విధ్వంసకర పాలనకు ప్రజలు చరమగీతం పాడి ఎన్డీఏ కూటమికి చారిత్రాత్మక విజయాన్ని అందించారని, దీంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. రెండేళ్ల కాలంలో ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా బాధ్యతాయుతంగా పాలన సాగిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి వర్గానికి చేరవేస్తున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంపై ప్రజల నమ్మకం చెక్కుచెదరలేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని, అనేక అడ్డంకులను అధిగమిస్తూ ప్రజలు మెచ్చేలా సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఏ రాజకీయ పార్టీకి లభించని స్థాయిలో మెజారిటీని ప్రజలు కూటమి ప్రభుత్వానికి అందించారని, ఆ నమ్మకానికి తగిన విధంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. సాగునీటి సంఘాలను బలోపేతం చేస్తూ రైతులకు అండగా నిలుస్తూ రాష్ట్రంలో రామరాజ్య పాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని, వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసి తాగునీటి విడుదల షెడ్యూల్‌ను కూడా ప్రకటించని దుర్మార్గపు పాలన సాగించారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమన్వయంతో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ రంగ ప్రోత్సాహం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఆయన అన్నారు.





# నేడు నూతలపాడులో ఎమ్మెల్యే ఏలూరి పర్యటన అభివృద్ధి పనుల ప్రారంభం

## సంక్షేమ పథకాలు అందజేత

## రెండేళ్ల నమ్మకం బహిరంగ సభ



**(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 19)**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా శనివారం పర్చూరు మండలం నూతలపాడు గ్రామంలో నిర్వహించే 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి బహిరంగ సభ' లిలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సహాయాలను అందజేయనున్నారు. డ్వాక్రా మహిళలకు 12 కోట్ల రూపాయల రుణాలు, అన్నదాత సుఖీభవ కింద రూ.26.50 కోట్లు నిధులు అందించనున్నారు. పర్యటన వివరాలు మ.3 గంటలకు నూతలపాడు గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలుకుతారన్నారు. మ.3.15 గంటలకు అరుంధతినగర్‌లో రూ.4.80 లక్షలతో ఆధునికీకరించిన భావిని ప్రారంభిస్తారన్నారు. మ.3.20 గంటలకు అంకమ్మతల్లి దేవాలయం వద్ద నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మ.3.30 గంటలకు: మసాలాపేటలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన ఐదు సీసీ రోడ్లను ప్రారంభిస్తారన్నారు. మ.3.35 గంటలకు ఆయుర్వేద ఆసుపత్రి, హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. మ.3.45 గంటలకు రూ.10 లక్షలతో ఆధునికీకరించిన ఫిల్టర్ బెడ్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు రెడ్డిపాలెంలో రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారని, సా. 4.30 గంటలకు జాగర్లమూడి రోడ్డులో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారన్నారు. సా. 4.45 గంటలకు తెలగపాలెంలో రూ.30 లక్షలతో నిర్మించిన రోడ్డును ప్రారంభిస్తారని తెలిపారు. సా.4.55 గంటలకు: పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సా.5.10 గంటలకు కుమ్మరపాలెంలో రూ.11 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. అనంతరం మజీద్‌లో ప్రార్ధనల్లో పాల్గొని, ముస్లిం స్మశానవాటికలో నిర్మించిన నూతన రోడ్లను పరిశీలిస్తారని తెలిపారు. సా.5.20 గంటలకు రెండేళ్ల నమ్మకం బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. సభ అనంతరం అన్నదాత సుఖీభవ పథకం కింద 37,861 మంది లబ్ధిదారులకు 26.50 కోట్లు అందజేస్తారు. డ్వాక్రా మహిళలకు రూ.12 కోట్లు రుణాల పంపిణీ రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో 2 ట్రాక్టర్ల ప్రారంభోత్సవం, ఆటోల పంపిణీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కుటుంబానికి పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షల చెక్కు అందజేత నియోజకవర్గంలోని 10మంది దివ్యాంగులకు ప్రభుత్వ సహకారంతో మంజూరైన త్రీవీలర్ స్కూటీలను 10 మందికి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

# పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.20.84 లక్షలతో ఆడిటోరియం నిర్మాణం

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 19)**

ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో పూర్వ విద్యార్థుల సహకారంతో రూ.20.84 లక్షల వ్యయంతో ఆడిటోరియం నిర్మాణం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్నర్‌షిప్ ఫర్ జీరో పావర్టీ) కార్యక్రమంలో భాగంగా కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో మరో ముందడుగు పడిందన్నారు. కనిగిరి ఎమ్మెల్యే, ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చొరవతో పూర్వ విద్యార్థుల సహకారంతో, దాతల సహకారాన్ని సమీకరించి పీసీపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఆడిటోరియంను ప్రారంభించడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఒక్క పిలుపుతోనే దాతలు స్పందించి సుమారు రూ.20,84,324 విరాళాలను అందించగా, ఆ నిధులతో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఆధునిక సౌకర్యాలతో ఆడిటోరియం నిర్మించబడిందన్నారు. ఈ ఆడిటోరియం విద్యా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉండనుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆడిటోరియంను ప్రారంభించి, సమాజ అభివృద్ధిలో భాగస్వాములైన దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ4 కార్యక్రమం ద్వారా సమాజంలోని ప్రతి ఒక్కరూ పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, దాతలు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com